క్లుప్తంగా

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



ఉయ్యూరు: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విజిలెన్స్ ఎవేర్నెస్ వీక్-2024 స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ మీట్‌ను బ్యాంకు రీజనల్ మేనేజర్ కె. వెంకటరావు ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో యూనియన్ బ్యాంకుకు సంబంధించిన పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజనల్ మేనేజర్ రామలింగారెడ్డి, తాతాజీ, విజిలెన్స్ అధికారి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కానూరులో డాగ్ షో



పెనమలూరు: కానూరులో ఆదివారం డాగ్ షో నిర్వహించారు. ది కెన్నెల్ అసోసియేషన్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో కానూరు సామ్రాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో డాగ్ షో ఐదు గ్రూపులుగా నిర్వహించగా 24 రకాల జాతుల శునకాలు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రధానంగా జర్మన్‌షెపర్డ్, బెల్జియన్ షెపర్డ్, బాక్సర్, డాబర్‌మెన్, రూట్‌విల్లర్, సైబీరియన్‌హస్కి ఇలా పలు జాతుల శునకాలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని డీఐజీ సెంథిల్ కుమార్ ప్రారంభించారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, పాఠశాల సెక్రెటరీ టి. సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ మోనికా సుమన్, ప్రిన్సిపాల్ భారతీధర్ పాల్గొన్నారు. హైదరాబాద్ కెన్నెల్ కార్యదర్శి కె. ప్రవీణ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఉంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎ. అమ్మన్న తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల ఒకటో తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో సీహెచ్ విన్ని, చంద్రిక, నికిత, బాలుర విభాగంలో నాగసంతోష్, హర్షవర్ధన్, చేతన్ సింహాలు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో 9, 10 తేదీల్లో జరగబోవు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్. క్రాంతిని అభినందించారు.

పురస్కారాలు నటీనటుల బాధ్యతను పెంచుతాయి

సినీ నటుడు సుమన్



విజయవాడకల్చరల్: పురస్కారాలు నటీనటుల బాధ్యతను పెంచుతాయని సినీ నటుడు సుమన్ అన్నారు. శారదా కళా సంస్థ 46వ వార్షికోత్సవాన్ని గాంధీనగర్‌లోని ఆలపాటి రామారావు, అనుమల లక్ష్మణరావు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. కవులు, కళాకారుల జీవితాల్లో సాంస్కృతిక కళాసంస్థలు వెలుగులను నింపాలని సూచించారు. తన సినీ నట జీవితం వడ్డించిన విస్తరి కాదని, అనేక కష్టాలను పడ్డానని తెలుగు ప్రేక్షకులు తనను గుండెల్లో పెట్టుకున్నారని గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కళాసంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు.

పవర్ ఫస్ట్ లుక్ విడుదల

శారదా కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ.. 46 ఏళ్ల క్రితం సాంస్కృతిక కళారంగాలకు పెద్దపీట వేస్తూ సంస్థను స్థాపించామన్నారు. విజయవాడ నగరం సర్వకళల సమాహారమన్నారు తెలుగు సినిమా రంగానికి చెందిన నటీనటులను సత్కరించే అవకాశం కలిగిందన్నారు. సంస్థ సభ్యుడు అనుమల లక్ష్మణరావు దంపతులు సుమన్‌ను ఆత్మీయంగా సత్కరించి రజిత కలశాన్ని అందజేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత, దర్శకుడు పి.వెంకటరమణ, విద్యావేత్త ఎంసీ దాస్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, శారదా కళాసమితి బాధ్యులు కొండిశెట్టి సురేష్, గోళ్ల రామచంద్రరావు, కేవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. పీవీ రమణ దర్శకత్వం వహించిన పవర్ చిత్రం ఫస్ట్ లుక్‌ను అతిథులు విడుదల చేశారు.

ఆక్రమణల చెరలో పంట కాలువలు

- సాగునీరు అందక నష్టపోతున్న రైతులు
- మొద్దునిద్రలో అధికారులు



పురుషోత్తపట్నం రోడ్డు మార్గంలో చీమలవాగు వెంట ఆనవాళ్లు కోల్పోయిన పంట కాలువ



కొత్తగూడెం వద్ద ఆక్రమణకు గురైన చీమలవాగు

గన్నవరం రూరల్: మండలంలోని పంట కాలువలు ఆక్రమణల చెరలో ఉన్నాయి. దీంతో సాగునీరు ఎటూ కదలక పంట చేలు మునిగిపోతున్నాయి. అధికార యంత్రాంగం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని 21 గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. పంట కాలువల నిర్వహణను పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు మొద్దునిద్రలో ఉన్నాయి. పలుచోట్ల రైతులు ఎంతో పెద్దవిగా ఉన్న పంట కాలువలను ఆక్రమించగా, మరికొన్ని చోట్ల వాటిని పూడ్చివేసి సాగు భూముల్లో కలిపేసుకున్నారు. పురుషోత్తపట్నం రహదారి వెంట వెంచర్లు వేసి పలుచోట్ల పంట కాలువలు పూడ్చి చిన్నచిన్న తూములు నిర్మించి వాటి ద్వారా సాగునీటిని పంపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆ నీరు మిగిలిన భూములకు అందడం లేదు. ఇటీవల వరదలకు మండలంలోని పంట భూములన్నీ మునిగిపోయాయి. మండలంలో 17,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలు ఆరు వందల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఈ ఉద్యాన పంటలు సైతం సరైన పంట కాలువల మార్గం లేక మునిగిపోయాయి. ముస్తాబాదలో 5,600 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా పంట కాలువల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంతో నాలుగు వేల ఎకరాలు ముంపునకు గురైంది. అదేవిధంగా చెరువులు కింద కళింగలు ద్వారా పంట కాలువుల్లోకి నీరు వెళ్లే మార్గాలు కంప చెట్లు, వ్యర్థాలతో నిండిపోయాయి. ఈ పరిస్థితి సాగునీటి మార్గాలకు అడ్డంకిగా మారింది.

నివారణ చర్యలు నిల్

పోలవరం కాలువ దిగువ నుంచి కొత్తగూడెం వద్ద ప్రవహించే చీమలవాగు ఆక్రమణలకు గురికావడంతో పాటు దాని నుంచి పంట భూములకు వెళ్లే సాగునీటి మార్గాలు ఆక్రమణలకు గురికావడంతో రైతులు వాగు ఉన్నా.. నీరు అందక ఇక్కట్లు పడుతున్నారు. మాదలవారిగూడెంలో సాగునీటి మార్గాలు క్వారీ తవ్వకందారులు పూడ్చివేయడంతో సాగునీరు వెళ్లే దారులు మూసుకుపోయాయని ఆ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపావులూరు ఎర్రచెరువు ఆక్రమణలతో చెరువు నీరు పంట పొలాలకు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ పంట కాలువల నిర్వహణపై రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ నిర్వాహణ శాఖలు సంయుక్తంగా కార్యచరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు. వెంచర్‌దారులు పంట కాలువలను మూసివేస్తున్నా.. కనీసం వీఆర్వోలు కూడా పట్టించుకోవడం లేదని, ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రతి గ్రామంలోను ఆక్రమణలకు గురైన సాగునీటి కాలువలను గుర్తించి వాటిని వారి చెర నుంచి విడిపించాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నారు.

రెడ్డి కార్పొరేషన్ ప్రకటించాలి

ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి



రెడ్డి సంఘం కార్యవర్గ సమావేశంలో నేతలు

ఉయ్యూరు: ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను తక్షణమే ప్రకటించాలని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెడ్డి సంఘం కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం, కార్తిక వన సమారాధన మహోత్సవాన్ని ఆదివారం ఉయ్యూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ప్రకటించి, కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుపేద రెడ్ల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారుపల్లి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్ల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందన్నారు. సంఘం బలోపేతానికి ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సానంరెడ్డి సుహాసినిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు బసవపున్నారెడ్డి, ప్రతినిధులు శకుంతలరెడ్డి, సుశీలరెడ్డి, మాధవీరెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మర్రెడ్డి శేషిరెడ్డి, నళిని రామిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అంధకారంలో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి



జాతీయ రహదారిపై వెలగని వీధి లైట్లు

గన్నవరం: చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విమానాశ్రయం నుంచి గన్నవరం వరకు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో సాయంత్రం అయితే చాలు జాతీయ రహదారి అంధకారంగా మారుతోంది. దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో భాగంగా సీఆర్డీఏ నేతృత్వంలో రామవరప్పాడు నుంచి ఆత్కూరు వరకు జాతీయ రహదారిని సుందరీకరించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఎల్ఈడీ వీధి లైట్లు నిర్వహణ లోపంతో కొంత కాలంగా వెలగడం లేదు. దీంతో ఎయిర్‌పోర్ట్ నుంచి దుర్గాపురం, గన్నవరం వరకు జాతీయ రహదారి చీకటిమయంగా మారుతోంది. అత్యంత రద్దీగా ఉండే హెచ్‌సీఎల్ క్యాంపస్, కొత్తపేట, గాంధీబొమ్మ సెంటర్లలో అంధకారం ముసురుకుంటుంది. చీకటిగా ఉండే ప్రాంతంలో బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఆర్డినెన్స్ జారీ చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అధికారం ఉందని సుప్రీంకోర్టు ఆగస్టులో తీర్పు వెలువరించినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ నెల 5వ తేదీన విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ఏపీ ఎమ్మార్పీఎస్ 11వ వార్షికోత్సవ మహాసభను మాదిగలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొకినాల సాంబశివరావు, అరుంధతీయ బంధు సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు మట్టా వరసాయిప్రసాద్, అరుంధతి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు కొమ్మాని కవిత, మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల సన్నిధిలో రాజమండ్రికి చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. రాజమండ్రికి చెందిన శ్రీగాయత్రి నృత్య కళానికేతన్‌కు చెందిన గాయత్రి పట్నాయక్ శిష్యబృందం పలు కీర్తనలకు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

• రావి, వేప చెట్లకు కల్యాణం



రావి, వేప చెట్లకు కల్యాణం చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రావి, వేప చెట్లను హిందువులు ఎంతో పవిత్రమైనవిగా భావించి పూజిస్తారు. ఈ కోవలోనే బాపులపాడు మండలం వేలేరులో ఆదివారం రావిచెట్టు, వేప చెట్టుకు వివాహం జరిపించారు కొల్లూరు అర్జునరావు, కస్తూరి దంపతులు. గ్రామంలోని పిన్నమనేని సిద్దార్థ గ్రామీణ వైద్యశాల ప్రాంగణంలో జంటగా వెలసిన ఈ వృక్షాలకు 16 ఏళ్ల వయస్సు పూర్తి కావడంతో శాస్త్రోక్తంగా పురోహితుడి సమక్షంలో వేద మంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. అర్జునరావు, కస్తూరి దంపతులు రావి, వేప చెట్లకు మంగళసూత్రాన్ని కట్టారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు



కంకిపాడులో బ్రాహ్మణ సంఘ ప్రతినిధులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఉప ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలి కార్తిక సోమవారం పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, తాగునీటి వసతి, దీపాలు వెలిగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా కార్తిక వన సమారాధన

కంకిపాడు: బ్రాహ్మణ సంఘం కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని పావన్ గాయత్రీ ధ్యాన మందిర్‌లో ఆదివారం కార్తిక వన సమారాధన ఉత్సాహంగా జరిగింది. ఉదయం గోపూజ, ధాత్రీపూజ జరిపించారు. చిన్నారుల కేరింతలు, ఆటపాటలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులకు సత్కారాలు చేశారు. అన్నసమారాధనలో మండలం వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షుడు డాక్టర్ దీవి రాధాకృష్ణ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కానూరి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు ఉపద్రష్ట గంగాధర్‌రావు, కోశాధికారి దీవి రోహిణికుమార్ పర్యవేక్షించారు.

కార్తిక మాస పూజలకు ఏర్పాట్లు



కేసరపల్లిలో ఏలూరు కాలువ గట్టును శుభ్రం చేస్తున్న సిబ్బంది

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువ గట్టు వద్ద కార్తిక మాస మొదటి సోమవారం సందర్భంగా భక్తులు నది ప్రవాహ నీటి స్నానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కాలువ గట్టు ప్రాంతంలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేసి బ్లీచింగ్, సున్నం చల్లించారు. తెల్లవారుజాము నుంచి కేసరపల్లి పరిసరా ప్రాంత భక్తులు నది స్నానాలు చేసేందుకు ఇక్కడికి తరలిరానున్నారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీ విశాలక్షి అన్నపూర్ణ దేవి సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విభూది అభిషేకం నిర్వహించనున్నారు. దుర్గాపురంలోని గుమ్మడి నాగేంద్ర క్షేత్రం, దావాజీగూడెంలోని శివాలయంలో కార్తిక మాస పూజలు కొనసాగుతున్నాయి.

ప్రయాణం నరకప్రాయం

- అధ్వానంగా మద్దూరు-ఈడుపుగల్లు రోడ్డు
- గత ప్రభుత్వంలో రూ. 19 కోట్ల నిధులు కేటాయింపు
- శంకుస్థాపన జరిగినా పట్టించుకోని కూటమి సర్కారు



వణుకూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



గోసాల వద్ద రోడ్డు కోతకు గురై ఏర్పడ్డ గుంతలు



ఈడుపుగల్లులో అధ్వానంగా ఉన్న రోడ్డు

కంకిపాడు: నిధులు మంజూరై శంకుస్థాపన జరిగినా అభివృద్ధి వైపు కూటమి సర్కారు దృష్టి సారించడం లేదు. రోజు రోజుకీ రహదారి పరిస్థితి అధ్వానంగా మారుతుండటంతో రాకపోకలు సాగించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మద్దూరు-ఈడుపుగల్లు రోడ్డు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు వెనుకడుగు వేస్తున్న వాహనదారులు

విజయవాడ-దివిసీమ(కరకట్ట)ను కలుపుతూ మద్దూరు-ఈడుపుగల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం ఉంది. ఇది మద్దూరు, వణుకూరు, గోసాల, విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మీదుగా ఈడుపుగల్లు, ఉప్పలూరు వద్ద కంకిపాడు-గన్నవరం రోడ్డును కలుస్తుంది. కరకట్ట మీదుగా రాకపోకలు సాగించేందుకు, గన్నవరం విమానాశ్రయం, ఏలూరు రోడ్డు మార్గాలకు వెళ్లే ప్రజలకు ఇదే ప్రధాన మార్గం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు మార్గం గుండా ఇసుక యథేచ్ఛగా తరలించారు. భారీ లోడు వాహనాలతో రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డు మొత్తం కోతకు గురై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అక్కడక్కడ భారీ అగాథాలు ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే నరకాన్ని చూడాల్సి వస్తుందని వాహనదారులు భయపడుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రహదారి గుంతల్లో నీరు చేరి గొయ్యి ఎక్కడో? తెలీక వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. రాత్రిళ్లు అయితే ఈ మార్గంలో ప్రయాణం సాగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గోతులు, కోతకు గురైన రోడ్డు మార్గంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్న దుస్థితి ఏర్పడింది.

అభివృద్ధి జాడేదీ?

మద్దూరు-ఉప్పలూరు వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు రోడ్డు కష్టాలు లేకుండా చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 19 కోట్ల నిధులు కేటాయించింది. రోడ్డు పనులు ప్రారంభించేందుకు అప్పటి గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ఈడుపుగల్లు సెంటరులో శంకుస్థాపన కూడా జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్డు అభివృద్ధి అంశాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. నిధులు కేటాయింపులు జరిగి, శంకుస్థాపన జరిగినా రోడ్డు పనుల కొనసాగింపు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పలు రహదారులకు పల్లె పండుగ పేరుతో శంకుస్థాపన చేస్తున్నా.. ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకోకపోవడం గమనార్హం. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న తమపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆయా గ్రామస్తులు, వాహనదారులు విమర్శిస్తున్నారు.

రీ సర్వేపై గ్రామసభలు

కంకిపాడు: భూముల రీసర్వేపై నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి. భావన్నారాయణ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4వ తేదీన కంకిపాడు, 5న నెప్పల్లి, 6న చలివేంద్రపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడంతో రీసర్వేపై సభలు పూర్తవుతాయన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి అందిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

నేడు గోసాలలో గ్రామసభ

పెనమలూరు: గోసాల గ్రామంలో సోమవారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు తెలుపుతూ భూముల సర్వేకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభల్లో భూ యజమానులు తెలపాలని సూచించారు. గోసాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామ పంచాయతీలో సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్న భూయజమానులు సంబంధిత డాక్యుమెంట్లతో గ్రామసభకు హాజరుకావాలని సూచించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లు

గన్నవరం: కార్తిక మాసం సందర్భంగా పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట శివక్షేత్రాల సందర్శనకు గన్నవరం నుంచి ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడుపుతున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ పి. శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాల యాత్ర టిక్కెట్ ధర సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 1,150, అల్ట్రా డీలక్స్‌కు రూ. 1,080గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఒకే గ్రామం నుంచి 35 మంది వరకు భక్తులు బుక్ చేసుకుంటే అక్కడి నుంచి బస్సు నడపనున్నట్లు తెలిపారు. పంచారామాల బస్ సర్వీస్‌ల కోసం 8790996090, 7382905633 నంబర్లను సంప్రదించాలని డీఎం కోరారు.

12 నుంచి జీపీడీపీపై శిక్షణ కార్యక్రమాలు

విజయవాడరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు, కార్యదర్శులకు, గ్రేడ్-5 కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జీపీడీపీ, బీపీడీపీలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి. విగ్గీన్స్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో నిష్ణాతులైన అధికారులతో ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 2025వ సంవత్సరంలో గ్రామ, మండల స్థాయిల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలను తయారు చేయడం, వాటిని అమలు చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపకరిస్తాయని వివరించారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

పెనమలూరు: ఎమ్మెల్సీ ఓటు హక్కుకు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేయాలని తహసీల్దార్, సహాఓటరు నమోదు అధికారి గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు కావాలంటే ఫారం-18 పూర్తి చేసి తమకు అందజేయాలన్నారు. విద్యార్హత నకలు గెజిటెడ్‌తో అటెస్టేషన్ చేయించి, ఫారం-18 పూర్తి చేసి, ఫొటో జతపరిచి, ఆధార్ ఫొటోస్టాట్‌తో దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

సైకాలజిస్టుల సేవలు విస్తరించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటి సమాజంలో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో సైకాలిజస్టుల సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. విజయవాడ పటమటలోని న్యూ పీఅండ్‌టీ కాలనీలో హ్యాపీ లైఫ్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కౌన్సెలింగ్ సెంటర్ అందుబాటులోకి తెచ్చిన సైకాలజిస్ట్ కల్యాణి దేవిరెడ్డిని ఆయన అభినందించారు. న్యూరో సైకియాట్రిస్ట్ ఆర్కే అయోధ్య, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సైకాలజీ విభాగం గౌరవ ఆచార్యులు డాక్టర్ టి.డి. విమల, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఉప సంచాలకుడు ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. మానసిక సమస్యలకు ఎన్నో కారణాలు ఉంటాయని, వాటిని తెలుసుకుని పరిష్కరించుకునేందుకు అపోహలు, భయాలు వీడి సైకాలజిస్టుల సాయం తీసుకోవాలని సూచించారు.